# చీకటి కిరణాలు

కథలు చదవటం, పెథిడిన్ ఇంజక్షన్లు తీసుకోవటం ఒకే బాపతుకు చెందిన పనని వెంకటరత్నం మాస్టారి నిశ్చితాభిప్రాయం.

పెథిడిన్ ఇంజక్షను మనిషి చేయిపట్టుకొని లాలిస్తూ తీయని ఊహాలోకంలోకి లాక్కుపోతుంది. ఆ పట్టుసడలి 'రఫీ' మని నిజజీవితంలో పడ్డమనిషి చుట్టూ ఆవులుముకున్న చేదును భరింపలేక తీయని ఊహాలోకంలోకి మళ్ళీ చేరాలనుకుంటాడు. అందుకే మళ్ళీ మళ్ళీ పెథిడిన్ ఇంజక్షన్లు పుచ్చుకోవటం. కథలు కూడా పాఠకుల్ని మధురభావాల్లో ముంచుతుంటాయి. తమ బ్రతుకుల్లోలేని ఆ మాధుర్యాన్ని జుర్రుకుంటూ ఆ తన్మయత్వంనుండి బయటపడాలని లేక, పడలేక అదేపనిగా కథలు చదువుతుంటారు పాఠకులు-ఇదీ వెంకటరత్నం మాస్టారు తన అభిప్రాయానికిచ్చే వివరణ. ఎన్ని వందల కథలో చదివి, అవి నిస్సారమైనవని తెలుసుకున్న అనంతరం ఈ అభిప్రాయానికి రాలేదు మాస్టారు. ఆయన కలా అనిపిస్తుంది. అంతే. అలా అనిపించటానికి కారణమేమిలేదు.


అంతేసి ఖరీదుపెట్టి వారపత్రికలు కొనేవారిని చూసి వెంకటరత్నం మాస్టారు మహాబాధగా జాలిపడిపోతారు. వారపత్రికల వెల మరీ పెరిగిపోయాక ఆయన జాలిపడటం మొదలెట్టలేదు. వారపత్రికల ధర పావలా వున్నపుడూ ఆయన అలానే జాలిపడేవారు. వెంకటరత్నం మాస్టారుకు కథలు చదివే అలవాటులేదు. కొనే అలవాటు అసలేలేదు. అయితే ఆయనకో తమాషా అయిన అలవాటుంది. తెలిసినవారి చేతిలో వారపత్రిక కనుపిస్తే అడక్కుండానే దాన్ని అందుకుంటారు. అందులోని వారఫలాల పేజీ తిప్పి 'తుల' చదువుతారు. చదివి 'ప్చ్' అని తేలిగ్గా తేల్చిపడేసి పత్రికను గొట్టంలా గుండ్రంగా చుట్టి తిరిగిస్తూ "ఏడ్చారు వెధవలు. లక్షలాది మనుషుల జీవిత గమనాన్ని నాలుగుమాటల్లో చెప్పటమంటే మాటలటోయ్" అని అంటారు. శ్రోత సమాధానాన్ని ఆయన పట్టించుకోరు. అలాగని మాస్టారుకు గ్రహబలాలమీద, వారఫలాలమీద నమ్మకంలేదనుకోవటం పొరపాటు. ప్రతివారం తన రాశిలో ఏం వ్రాశారో చూసుకోవాలన్న కుతూహలం వుంది ఆయనకు. శుభప్రదమని వ్రాసినపుడు అలా జరిగితే బావుండన్న ఆశా వుంది. అశుభం పలికితే అలానే జరుగుతుందేమో నన్న భయమూవుంది.

వెంకటరత్నం మాస్టారు ఇరవై వూళ్ళకు బదిలీఅయి, ముప్పయి సంవత్సరాలు పాఠాలుచెప్పి ఈమధ్యనే 'రిటైర్' అయారు. ఆయన తండ్రి మాస్టారుకు ఒక్క పెంకుటిల్లు మాత్రం అప్పగించాడు. ఆయన హయాంలోనూ వెంకటరత్నం మాస్టారు ఏమీ వెనకేయలేక

నాగభైరవ ఆంజనేయులు

పోయారు. రిటైర్ అయేనాటికి మాస్టారుకు పోస్టాఫీసు సేవింగ్సు బాంకులో ఆరువందల నలభై రెండు రూపాయల బాలన్సుంది. రక్తపోటుతో కాలం వెళ్ళబుచ్చుతున్న అర్ధాంగివుంది. అంతే గాకుండా నాలుగేళ్ళక్రితం బి.ఏ అనిపించుకొని పనేమీ దొరక్క దొరికిన స్నేహితులతో జులాయిగా తిరిగే పుత్రరత్నమున్నాడు.

ఇల్లు అంతపెద్దది కాకపోయినా, మధ్యలో మేదర తడిక అడ్డంకట్టించి ఒక భాగం ఆ వూరి హైస్కూల్లోని సైన్సు మాస్టారుకు అద్దెకిచ్చాడు. రిటైరయ్యాక వెంకటరత్నం మాస్టారు వీలయినంతమంది పిల్లలను ప్రైవేటుకు రాబట్టుకొని, ఆ రాబడితోనూ, అద్దెతోనూ బ్రతుకు బండిని లాగుతున్నాడు.



సైన్సు మాస్టారుకు ప్రతివారం పత్రికలు కొనే అలవాటుంది. వెంకటరత్నం మాస్టారు ఆ పత్రికల్లోనే వారఫలాలు చదువుకుంటుంటాడు ఈ మధ్య.

వరండాలో వేసున్న నులకమంచం మీద వెల్లికలా పడుకొని ఆ వారపు పత్రికలో 'ఫల' చూస్తున్న వెంకటరత్నం మాస్టారి చూపును ప్రక్క పేజీ ఆకర్షించింది. ఆర్టిస్ట్ 'బండిపంతులు' అన్న అక్షరాలను అతి రమణీయంగా తీర్చాడు. బడిపంతుళ్లు ఎంత దరిద్రంగా వుంటారో, వారి బ్రతుకు లెంత భయంకరంగా వుంటాయో తెలియకపోవటం వల్లనే ఆర్టిస్ట్ ఆ అక్షరాలను అంత అందంగా వ్రాశాడనిపించింది వెంకటరత్నం మాస్టారుకు.

చాక్లెట్ చూపిన చిన్నపిల్లాడిలా అయిపోయారు మాస్టారు. బడిపంతులు గురించి ఏంవ్రాశారో చదవాలన్న కుతూహలం మొదలయింది. తానూ బడిపంతులాయె మరి! చక చకా కథ చదవసాగాడు మాస్టారు. రచయిత తన నైపుణ్యంతో బడిపంతులు జీవితాన్ని అతి విషాదంగా తీర్చిదిద్ది పాఠకుల కళ్ళలో నీళ్ళు సుళ్ళు తిరిగేలా చేశాడు.

సాంతం కథ చదివి "ఫర్లేదు. కథలు ఆకాశంలో విహరించటంలేదు. నేలమీద

నడుస్తున్నాయి. కథలూ జీవితాలే. ఎంత సహజంగావుందీ కథ" అని అనుకున్నారు పొడి పొడిగా తడికళ్ళను మునివేళ్ళతో అద్దుకుంటూ. అద్దుకొని ఎవరో చెయ్యి పట్టి లాగినట్లు రక్కునలేచి కూర్చొని, కూర్చునే కుదురులేనట్టుగా తిరిగి మంచం మీదికి ఒరిగి "ఏమేవ్? ఇలా తగలడు" అని గట్టిగా కేకేశాడు. వెంకాయమ్మ "ఏవిటా గావుకేకలు" అంటూ వరండాలో కొచ్చింది.

"కథ లెలా వుంటాయో తెలుసా?" తెలుగులోనే ప్రశ్నించారు వెంకటరత్నం మాస్టారు. వెంకాయమ్మకు ప్రశ్న అర్థం కాలేదు. జవాబు ఏం చెప్పాలో తెలియ లేదు. విచిత్రంగా తనవైపు చూస్తూ నిల బడిన అర్ధాంగిని చూసేటప్పటికి వెంకట రత్నం మాస్టారుకు తానుచేసిన పొరపాటు తెలిసొచ్చింది. వంకాయ కూర ఎలా వండాలో, ఆవకాయలో నూనె ఎంత పోయాలో అడిగితే తడుముకోకుండా చెప్పగలదేగాని కథలుగురించి ఆమేం చెబుతుంది-అ ఆలు ఎలా వుంటాయో కూడా తెలియని అమాయకురాలు.

"నా ముఖం .. కథలుగురించి నిన్న డగట మేమిటి?" అన్నారు మాస్టారు లేచి కూర్చుంటూ.

"బాగానేవుంది సంబడం" అంటూ లోనికిపోయింది వెంకాయమ్మ.

సరిగ్గా అదేసమయంలో వెంకట రత్నం మాస్టారుకు కథలమీదున్న దురభి ప్రాయం తొలిగిపోయింది.

* * *


బడిపంతులు కథ వెంకటరత్నం మాస్టారులో వూహించని మార్పు తెచ్చింది. కథలంటే మాస్టారుకు ఆసక్తి మొదలయింది. ఆయన మనసులో తెలుగు కథలన్నా, అవి వ్రాసే కథకులన్నా, వాటినివేసే పత్రికలన్నా గౌరవం పెరిగిపోయింది. అప్పట్నించి వారం వారం సైన్సు మాస్టారి వారపత్రికల్లో 'తుల'తో బాటు కథలూ చదవసాగారు వెంకటరత్నం మాస్టారు. వారానికి ఒక కథయినా బడిపంతులు జీవితం చుట్టూ పరిభ్రమిస్తూ వుండటంతో-వెంకటరత్నం మాస్టారు పెరుగులోవేసిన వేడిగారెలా ఉబ్బిపోసాగారు.

వెంకటరత్నం మాస్టారు చాలా కథలు చదివారు కథల్లోని మాస్టారుల్లా గర్వ పడేవారు. తృప్తిగా నిట్టూర్పు లొదిలే వారు. వారికన్నిటిని పంచుకునేవారు.

అమెరికానుండి తిరిగొచ్చి కావాలని కానీకట్నం లేకుండా, తనను అక్షరా భ్యాసం చేసిన అధ్యాపకుడి మూడో కూతుర్ని తన అర్ధాంగిగా చేసుకున్న అప్పారావు కథను ఉత్సాహంగా చదివారు వెంకటరత్నం మాస్టారు.

వీధి బడిలో తనచేత గుంజిళ్ళు తీయించిన గుర్నాధం టీచర్ భార్య పక్ష వాతంతో మంచాన పడిందని తెలిసి, కల వర పడిపోయి, స్వయంగా కారులో వచ్చి తన నర్సింగ్‌హోంకు తీసుకెళ్ళి పైసా తీసుకోకుండా గురుపత్నికి వైద్యంచేసిన డాక్టరు భుజంగరావు కథను ఒకటికి రెండుసార్లు చదివాడు వెంకట రత్నం మాస్టారు.

మిట్ట మధ్యాహ్నం చెప్పుల్లేకుండా తార్రోడ్డుమీద నడచిపోతున్న రంగనాధం మాస్టారును హడలగొడుతూ ప్లీమత్




కారును ప్రక్కనే ఆపేసి, ఆనను తాను పరిచయం చేసుకొని ఆయన్ను ఆ కారులోనే తనింటికి తీసుకెళ్ళి ఘనంగా ఆతిధ్యమిచ్చి వారం తిరక్కుండానే. అడక్కుండానే మాష్టారి రెండో కొడుక్కి తన ఆఫీసులోనే వుద్యోగ మిచ్చిన శేఖర్‌బాబు కధను మళ్ళీమళ్ళీ చదివారు వెంకటరత్నం మాష్టారు. తాను చదవటమే కాకుండా మహదానందంతో తన భార్యకూ చదివి వినిపించాడు.

అవుట్‌డోర్ షూటింగుకు వచ్చి. ప్రొడ్యూసర్ కారులో తనచేత 'అఆలు' దిద్దించిన పంతులుగారింటికెళ్ళి ఆయన పడుతున్న అవస్థలను కళ్ళారాచూసి కరిగిపోయి పంతులుగారి ఇద్దరమ్మాలకు మంచి సంబంధాలు చూసి తనే కట్నాలిచ్చి పెళ్ళి జరిపించిన హీరో గిరిబాబు కధను ఆనంద బాష్పాలతో తడిపేశారు వెంకటరత్నం మాష్టారు.

తను చదివిన కధలను సమయం దొరికినపుడు గుర్తుకు తెచ్చుకోవటం అలవాటయి పోయింది వెంకటరత్నం మాష్టారుకు. తన శిష్యులు ఎందరో డాక్టర్లు, కలెక్టర్లు, లాయర్లు, ఆఫీసర్లు .ఓహ్! . వారంతా తన శిష్యులు. జీవితంలో వారు ఎక్కి కూర్చున్న అంతస్థుకు పునాదులు వేసింది తాను. అలా అనిపించటంతో మాష్టారుకు సగం ఆకలి తీరినట్లనిపించింది చంద్రమండలం చేరినట్లనిపించింది. తన నరాల్లో అమృతం పారినట్లనిపించింది. ఆ పూట భోజనం చేయకుండానే ఆరుబయట నులక మంచంమీద పడుకొని మబ్బుల్లో తేలుతున్న జాబిల్లిని చూస్తూ వూహల్లో తేలిపోయారు. ఆ వూహలలో సోలిపోతూ

నెమ్మదిగా నిద్రలోకి వాలిపోయారు.

* * *

నారాయణ వచ్చాడు వెంకటరత్నం మాష్టారిని చూట్టానికి. తెల్లపాడులో పని చేసేటప్పుడు మాష్టారు నారాయణకు అక్షరాలు నేర్పారు. నారాయణ ప్రస్తుతం బ్యాంక్‌లో కాషియర్. వెంకటరత్నం మాష్టారి స్వగ్రామం నారాయణ అత్తగారి వూరు కావటంతో - సెలవులకు అత్తగారింటికి వచ్చినపుడు మాష్టారిని పలకరించి పోతూంటాడు నారాయణ.

మాటల మధ్యలో నారాయణ మాష్టారితో అన్నాడు—

"అబ్బాయి బి. ఏ. కాకుండా బి. కాం. అయివున్నట్టయితే బాంక్‌లో ఏదో వుద్యోగంలో ఇరికించేవాడిని" అని.

ఆ మాటకు వెంకటరత్నం మాష్టారు పొంగిపోయారు. నిజంగా తన కొడుక్కి-ఉద్యోగం వచ్చినట్లే సంబరపడిపోయారు. నారాయణకు తనమీదున్న అభిమానానికి, అతడు కనపరుస్తున్న అప్యాయతకు మాష్టారి మనసు సరిగమలు పలికింది.

నారాయణ శలవు తీసుకొని వెళ్లాడు - మాష్టారిని ఏకాంతంలో వుంచే కాదు.... ఆశలోనూ ఆలోచనల్లోనూ ముంచి.

* * *

ఆనాటి స్థానిక వార్తాపత్రిక చూస్తున్న వెంకటరత్నం మాష్టారి చూపు మొదట పేజీలోని మూడో కాలంలో ఆగిపోయింది! క్రొత్తగా వచ్చిన జిల్లాకలెక్టరు ఫొటో వివరాలతోబాటు ప్రచురించారు.

"పాకాలలో పుట్టి ఆ వూరి వీధిబడిలో చదువుకున్న ప్రభాకరం...." పరిచయ వాక్యాలను మధ్యలోనే ఆపి ఫొటోవంక


# శ్రీ బాలాజీ వైద్యశాల



సెక్సుస్పెషలిస్టు డా॥ పి. కుమారస్వామి దేవర

మార్వాడి గుడివద్ద; ఫోన్: 551, తెనాలి (ఎ. పి.)

బ్రాంచి: 9_డి, శివాజీ స్ట్రీట్, మద్రాసు_17.

## దీర్ఘ వ్యాధులకు ఉత్తమ సిద్ధ వైద్యము

హస్త ప్రయోగం, అంగము చిన్నదగుట, సంభోగ కాలమందు అకస్మాత్తుగా అంగము కృశించుట, శుక్ల నష్టము, నపుంసకత్వము, (ఒక డోస్‌తో ఎన్నడూ కని విని ఎరుగనంత వీర్య స్తంభన కలిగి హాయినిచ్చును. అసంతృప్తి చెందు స్త్రీ, పురుషులు వాడతగినది) స్వప్నులు, కుష్టు, బొల్లి, చర్మవ్యాధులు, హెర్నియా (గిలక), పోస్టుద్వారా కూడా వైద్యం చేయబడును. ఉబ్బసం, క్షయ, ఆయాసం దగ్గులకు ఉచిత వైద్యం _రండి.

వరిబీజము (బుడ్డ), హెర్నియా, మూత్ర వ్యాధులు, ఆపరేషన్ లేకుండా బాగుచేయబడును. స్వయంగా వచ్చి సంప్రదించవలెను.

తదేకంగా చూశారు మాష్టారు. ఆ ఫొటోలో చిన్ననాటి ఆనవాలు ఏమీ లేక పోయినా వెంకటరత్నం మాష్టారుకు అని పించింది-ఆ ఫొటోలో వుంది తన శిష్యుడు ప్రభాకరమేనని. పాకాల .. మెల్లిగా గొణుక్కున్నాడు. అవును ...సందేహం లేదు . .ప్రభాకరం తన శిష్యుడు. కలెక్టరు ప్రభాకరానికి 'కా' గుణితం నేర్పింది తనే. ఎక్కాలు చెప్పిందీ తనే. వెధవ ... అప్పుడు...చిన్నప్పుడు చదువుమీద ధ్యాస లేకుండా జులాయిగా తిరిగేవాడు. రోజూ గోడకుర్చీ వేయించి, చెవులు మెలేస్తూ మరీ దగ్గరుండి ప్రత్యేక శ్రద్ధతో చది వించి చదువుమీద శ్రద్ధ ఏర్పరిచిందీ తనే.

'జిల్లాకలెక్టరు తన శిష్యుడు' అనుకోవ టంతో రాకెట్ ఎక్కినట్లనిపించింది వెంకటరత్నం మాస్టారుకు. పెరిగిన గడ్డాన్ని, గుబురు మీసాలను కుడిచేత్తో తడుముకున్నారు హుందాగా. ఏదో తెలి యని తృప్తి మాస్టారిలో సరికొత్త ఓపి కను తెచ్చిపెట్టింది.

వెంకటరత్నం మాస్టారు చదివిన 'బడి పంతుళ్ళ' కథలు ఆయన మనసులో నాట్యం చేశాయి. 'వుపి'గొల్పాయి. 'ఆశ'ను తట్టిలేపాయి. ముందుకి తరి మాయి. మాస్టారుకి ధైర్యం చెప్పాయి. 'అవును. అలా చేస్తే ' మనసులోనే అనుకున్నారు మాస్టారు. నారాయణ చెప్పిన మాట చెవుల్లో మారుమ్రోగింది. తర్కించుకున్నాడు. మంచీ చెడులను బేరీజు వేసుకున్నాడు. అటువైపు మొగ్గు చూపింది మనసు. అదీ యిదీ కాదు.... జిల్లాకలెక్టరు. కలెక్టరు తలచుకుంటే కాని దేముంది. ప్రభాకరం చేతిలో పని. నిము షాల్లో జరుగుతుంది. తన కొడుకు ఏదో ఒక ఉద్యోగంలో చేరితే తన కష్టాలు తీరి పోతాయి. ఖర్చుపెట్టే ప్రతి పైసాను పది సార్లు బేరీజు వేసుకోవాల్సిన పనుండదు. కాస్త విశ్రాంతి తీసుకోవచ్చు.

పోస్టాఫీసుకి చేరాడు మాస్టారు ఆలో చనలను పేనుకుంటూ, చిక్కు విడదీసు కుంటూ. ఉన్న కొద్దిలో పాతిక రూపా యలు తీసుకున్నాడు.

* * *

బస్సు దిగి వెంకటరత్నం మాస్టారు కాలినడకనే కలెక్టరు బంగళాకు బయలు దేరాడు. నడిచి వెడుతున్న మాస్టారి చూపు రోడ్డు ప్రక్కనున్న పళ్ళదుకాణాల మీద తారట్లాడింది. అందమైన ఆపిల్ పళ్ళను జాజిచెక్క పెట్టెలమీద అందంగా అమర్చారు. అటూ యిటూ అరటిగెలను వేలాడదీశారు.

పళ్ళదుకాణం దగ్గరకు చేరాయి మాస్టారి కాళ్ళు. పళ్ళమీద నిలిచాయి హారి కళ్ళు.

పసిపిల్లల దగ్గరకు, పెద్ద పొజిషన్లో వున్న వారిదగ్గరకు ఒట్టి చేతులతో పోగూడదు. ఇచ్చేవాడికి తలకుమించే పనయినా పుచ్చుకునేవాడి తాహతుకు తగ్గవే యివ్వాలి-ఏవో కథల్లోని మాటలు మాస్టారికి గుర్తొచ్చాయి.

ఎప్పుడో చిన్నప్పుడు తన శిష్యుడు గాని ఇప్పుడు కలెక్టరు.

బిల్లు కలెక్టరు కాదు-జిల్లా కలెక్టరు.

కలెక్టరుకు అరటిపళ్ళు....ఛా ఛా.

కుచేలుడు శ్రీకృష్ణుడికి అటుకులు తీసు కెళ్ళలేదూ!

'వాళ్ళిద్దరూ ప్రాణస్నేహితులు. అదీ గాక అది కలికాలం కాదు.

పదినిముషాలు బేరమాడి ఐదు రూపాయలకు అరడజను ఆపిల్ పళ్ళు తీసుకున్నారు వెంకటరత్నం మాస్టారు.

ఆపిల్ పళ్ళు వున్న చేతిసంచిని అమృతభాండంలా అతిజాగ్రత్తగా పట్టుకొని ముందుకు నడిచారు.

* * *

గేటులో గూర్ఖాలేకపోవటంతో నేరుగా హాల్లోకి వెళ్ళారు వెంకటరత్నంమాస్టారు. గోడలకు తగిలించిన ఫోటోలు మాస్టారిని ఆకర్షించాయి. వాటిని చూడాలన్న కుతూహలంతో గోడదగ్గరకి చేరారు.

కలెక్టరు ప్రభాకరం ఐ. ఏ. ఎస్. కి సెలక్టయిన ఫోటో.

ఎన్. పి. పి. డ్రెస్‌లో కాలేజీలో చదివేటప్పటి ఫోటో.

హైస్కూలులో చదివేనాటి ఫోటో.

వీధి బడిలో చదువుకునే వయసు తన తలిదండ్రులతో ...ఇంకా....ఇంకా చాలా ఫొటోలున్నాయిగాని, వాటిని మాస్టారు చూడలేదు.

"హారి! వీడు ప్రభాకరమే" అని తనలో అనుకోలేదు మాస్టారు. పెద్దగా పైకే అనేశారు. అని చుట్టూచూశారు ఎవరయినా విన్నారేమోనని. ఆ హాల్లో మాస్టారు తప్ప మరెవరూ లేరు.

మాస్టారి అరుపువిని లోనినుండి పనికుర్రాడువచ్చి ఏం కావాలి అని అడిగాడు. మాస్టారు చెప్పిందివిని ఎగాదిగా చూసి 'అలాకూర్చోండి' అనిచెప్పి మళ్ళా లోనికి వెళ్ళాడు.

ఖరీదయిన సోఫాలు, ఫ్రేం కుర్చీలు, గాడ్రెజ్ ఛెయిర్స్, అంతేగాకుండాకొయ్యకుర్చీలు కొన్ని.


మాస్టారు సోఫాలో కూర్చోలేదు. ఫ్రేం కుర్చీల జోలికిపోలేదు. గాడ్రెజ్ కుర్చీలో కూర్చొని ఏమనుకున్నారో ఏమో మరుక్షణమే లేచివెళ్ళి కొయ్యకుర్చీఅంచున కూర్చున్నారు.

మాస్టారునుచూసి ఉప్పొంగి పొర్లుతున్న ఆనందంతో ఉక్కిరిబిక్కిరవుతూ పరుగుపరుగునావచ్చి, ఆయన్ని కావిలించుకున్నంత పనిచేసి—

"ఎవరో పరాయివాడిలా హాల్లో పడిగాపులు కాయటమేమిటండీ మాస్టారూ! నేను పరాయివాడినా. రండి లోనికిపోదాం" అంటూ మాస్టారును లోనికి తీసుకవెళ్ళాడు ప్రభాకరం. ఆరోజు శెలవుపెట్టి మాస్టారుకు ఘనమైన ఆతిథ్యమిచ్చాడు. అడిగి తెలుసుకొని మాస్టారు కొడుక్కి అక్కడికక్కడే వుద్యోగం యిచ్చేశాడు.

మెట్లమీద చప్పుడవటంతో ఊహల్లో నుండి బయట పడ్డారు మాస్టారు. వెంకటరత్నం మాస్టారు కుర్చీలోంచిలేస్తూ తలెత్తి చూశారు. ఫుల్‌సూట్‌లో దొరబాబులా దర్జాగా మెట్లుదిగుతున్నాడు కలెక్టర్ ప్రభాకరం కలెక్టరు చివరిమెట్టుమీదికి రావటంతో 'నమస్కారం' అంటూ రెండుచేతులూ జోడించారు మాస్టారు. ఆ క్షణంలో కలెక్టరు తన శిష్యుడనిగాని, తనకంటె వయసులో చిన్నవాడనిగాని మాస్టారుకి గుర్తుకురాలేదు.

కలెక్టరు ప్రభాకరానికి మాస్టారిమాట వినపడేవుంటుంది. కలెక్టర్ ప్రభాకరంకు మాస్టారు కనబడేవుంటారు. వినబడకుండా వుండటానికి ప్రభాకరానికి చెవుడు కన




బడకుండా వుండటానికి ఆయనకి చూపు మందగించలేదే! హోదాకు తగ్గట్టు ప్రవర్తించాలి. అందుకే చూడనట్టు అసలు ఆ హాల్లో తానుతప్ప మరోజీవి లేనట్లు నడిచి వెడుతున్నాడు కలెక్టరు ప్రభాకరం.

కలెక్టరుగారు తనని గుర్తుపట్టలేదని గ్రహించారు మాస్టారు. ఎప్పుడో ఇరవై ఏళ్ళక్రితం చూశాడు. ఏటేటా తన రూపంలో ఎన్నో మార్పులు. ఎలాగుర్తుపట్ట గలడు. ఆమాటకొస్తే తను మాత్రం. పరిచయ వాక్యాలు లేకుండా ఫోటోవేస్తే గుర్తుపట్టగలిగేవాడా?

తనని గుర్తుపట్టక పోవటంలో ప్రభాకరం తప్పేమీ లేదనుకున్నారు వెంకటరత్నంమాస్టారు.

చల్లకొచ్చి ముంతదాచడం అవివేకమే అవుతుంది. పనిమీదవచ్చి పట్టుదలకు పోవటం పిచ్చితనమే అవుతుంది.

తనని తాను పరిచయం చేసుకోటంలో తప్పేముంది.

గొంతు పెగల్చుకొని "నేను వెంకటరత్నం మాస్టారును, పాకాల వీధిబడిలో" మాస్టారు వాక్యాన్ని పూర్తిచేయలేదు. కలెక్టరు ప్రభాకరం ఒక్క_క్షణం కనురెప్పలెత్తి మాస్టారి ముఖంలోకి సూటిగా చూశాడు. గురువును గుర్తుపట్టడానికి శిష్యుడుకి విన్న ఆ ఒక్క_మాట చాలు. చూచిన ఆచూపుచాలు. ఆ ఒక్క_క్షణం సరిపోతుంది ఎన్నేళ్ళ గతాన్నయినా గుర్తు తెచ్చేందుకు.

కలెక్టరు ప్రభాకరం ముఖంలో యే మార్పూలేదు. మరుక్షణంలో కనురెప్పల్ని దించుకొని 'లై'పిన్నులు సవరించుకుంటూ

"వెంకటరత్నంగానీ, కోటిరత్నంగాని... మీతో మాట్లాడే అవసరంగాని తీరికగాని నాకులేదు. మినిష్టరు వస్తున్నాడు ఐనా ఆఫీసుపనులు ఆఫీసులోనే ఆ గూర్ఖా. ఎక్కడ చచ్చార్రా" మాస్టారుతో చెప్పి పని కుర్రాడిని కోపంగా కేకేశారు.

మాస్టారిమనసు చివుక్కు మంది. ఒక్కక్షణం తెల్లబోయి అదే క్షణంలో తేరుకున్నారు.

"తానుమాత్రం స్కూలుకు ఇన్‌స్పెక్టర్ వస్తూంటే ఎంత హడావిడి చేసేవాడు. ఎంత కలెక్టరయినా మినిష్టరంటే హడావిడికదూ" అని అనుకొని సమాధాన పడలేకపోయారు మాస్టారు.

తనగురించి చెప్పినా ప్రభాకరంగుర్తు పట్టలేదు.

"నేను మీ గురువుని. అక్షరాలు దిద్దించాను. జులాయిగా తిరిగే మీకు చదువు మీద శ్రద్ధ ఏర్పడేలా చేసింది నేను" అంటూ తనను తాను పరిచయం చేసుకోలేదు

"మా వాడికి ఉద్యోగం యిప్పించండి" అనివేడుకోలేదు.

"ప్రేమగా తెచ్చాను. తీసుకోండి." అని ఆపిల్స్ అందించలేదు

కలెక్టరు ప్రభాకరం వడివడిగాపోర్టికోలోకి వెళ్ళటం కారు బయలుదేరటం ఒకే నిముషంలో జరిగాయి.

వెంకటరత్నం మాస్టారు చేతిసంచిని తీసుకుని బంగళానుండి రోడ్డుమీదకి చేరాడు.

నడుస్తూగర్వంగా తృప్తిగా హుందాగా నవ్వుకున్నారు మాస్టారు. తాను వెలిగించిన చిరుదీపం .... ఇంతై ఇంతింతై ఎంతో పెరిగి పెరిగి ఈనాటికి ఇంత పెద్దదయింది. ఇప్పుడు ఆ దీపాన్ని తాను తాకలేదు. ఆ దీపకాంతిని తాను చూడలేదు.

పాపం ...మాస్టారుకు తాను వెలిగించిన దీపాలు వెలుగుకిరణాలునే ఇస్తాయని తెలుసుగాని...దీపాలనుండి చీకటికిరణాలు వస్తాయని తెలియదు. ఆ చీకటికిరణాలను గురించి ఆలోచించే శక్తి, ఆలోచించి తట్టుకునే మనోనిబ్బరం మాస్టారుకులేదు.

* * *

పొరుగూరు వెళ్ళేప్పుడు వెంకటరత్నం మాస్టారు భుజంమీద కండువా చేతిలో సంచీ తప్పనిసరిగా వుంటాయి. కండువావల్ల వుపయోగం వుంటుందిగాని, సంచివల్ల ప్రయోజనమేమీ వుండదు. సామాన్యంగా తీసుకువెళ్ళిన సంచిని తీసుకవెళ్ళినట్టే తిరిగి తెచ్చేవారు. ఏతావాతా ఏడాదికోమారు ఆ సంచిలో ఏదైనా తెస్తే అది చింతపండో కందిపప్పో అయి వుంటుంది. ఇంటికి పళ్ళు తెచ్చే అలవాటు మాస్టారుకు లేదు. అని ఆరోపించే కంటే ఆ అలవాటు చేసుకునేందుకు వారి ఆర్థిక స్తోమత ఆయనకు సహకరించలేదంటే సముచితంగా వుంటుంది. ఏ రోజయినా ఓ అరడజను పళ్ళు కొందామనిపించినా ఆ పావలా వుంటే పోపు గింజలకొస్తుంది అనిపించేది. పావలా ఖర్చుపెట్టే ముందు మాస్టారు పదిసార్లు

జెబుతోపా         యూ తడుముకుంటారు అది స్వతహాగా ఆయనకు అబ్బింది కాదు. పరిస్థితులు బలవంతంగా ఆయన తలమీద రుద్దిన అలవాటే.

వెంకటరత్నం మాస్టారు అందించిన సంచి అందుకొంది వెంకాయమ్మ. బరువుగా వుంది సంచి. తెరిచి చూసింది. నవనవలాడుతున్నాయి ఆపిల్స్. కళ్ళు మరీ పెద్దవి చేసుకుని వాటికేసి చూస్తుండి పోయింది.

ఐదు రూపాయలతో వెంకటరత్నం మాస్టారు కొన్న పళ్ళవి. ఆ నిజం చెప్పటానికి ధైర్యం చాల్లేదు మాస్టారుకు. అంతేగాకుండా జరిగింది జరిగినట్లు వివరించటానికి మనస్కరించలేదు.

"ఐదు రూపాయలు పెట్టి ఆపిల్ పళ్ళు తెచ్చాను" అని మాస్టారంటే "ఐదు రూపాయలా! అంత తెలివి తక్కువపని ఎందుకు చేశారు. మీరు ఏదిచేసినా ఇంతే" అని ఠక్కున అంటుంది వెంకాయమ్మ. ఆవిడముందు తెలివితక్కువ వాడిగా నిలబడటం. ఆమాట అనిపించుకోవడం మాస్టారుకు సుతరామూ ఇష్టంలేదు.

"అలా వెర్రిమొహం వేసుకొని చూస్తావేమే వెర్రిమొహమా! అవి ఆపిల్ పళ్ళు. అంటే మనలాంటివారు తినేవికాదు. ఆఫీసర్లు తినేవి. చాలా ఖరీదు. అలాంటిది ఒకటీ అరా కాకుండా అరడజను ఎలా తెచ్చాననే చూస్తున్నావ్ కదూ? అవి నేను కొన్నవి కాదు విడ్డూరంగా చెప్పారు మాస్టారు.

"ప్రభాకరమని... వెధవ... చిన్నప్పుడు రోజూ గోడకుర్చీ వేయించి చదివించే వాడిని. వాడిప్పుడు జిల్లా కలెక్టరు. నేను రోడ్డుమీద నడిచిపోతుంటే కారాపి కాదంటున్నా బంగళాకి తీసుకెళ్ళాడు. బలవంతం చేసి భోజనానికి అట్టేపెట్టాడు. పిండి వంటలు, కూరలు.... పేర్లూ తెలియవు. ఎన్నని. రెండు రోజులుండమని బలవంతంచేసి కన్నీరెట్టుకున్నాడని....నీవు గాభరా పడతావని తిరిగొచ్చా. వస్తుంటే ఇవిచ్చాడు." లేని ఆనందాన్ని-రాని ఉత్సాహాన్ని బలవంతంగా ముఖంమీద అద్దుకుంటూ, గొంతులో రుద్దుకుంటూ నమ్మేట్టు చెప్పారు వెంకటరత్నం మాస్టారు.

"బడిపంతులంటే ఏమోననుకున్నా" విస్తుబోయింది వెంకాయమ్మ.

వెంకటరత్నం మాస్టారు బడిపంతుళ్ళ విలువను, సమాజంలో వారికున్న గౌరవాన్ని, శిష్యుల అభిమానాన్ని పదింతలు చేసి దాన్ని ఇరవై చేత గుణించి చెప్పారు.

అప్పైన వెంకటరత్నం మాస్టారు తేలిగ్గా గాలి పీల్చుకున్నారు-తన కొడుకు వుద్యోగ విషయం మాట్లాడేందుకు బస్తీకి పోతున్నట్లు ముందుగా ఎవరితోనూ చెప్పనందుకూ, తన భార్య కొడుకు వుద్యోగం గురించి కలెక్టరుతో

చెప్పమని అననందుకూ.

"చూడు.. ఈ పూట నాకు అన్నం వండకు. భుక్తాయాసంగా వుంది. ఏమీ తినాలనిపించటంలేదు" త్రేన్చుతూ అన్నాడు....లోన ప్రేగులు కర కరలాడుతున్నా. నిజంగానే ఆ పూట మాస్టారుకు ఏదీ తినాలనిలేదు. వెంకాయమ్మ మాస్టారి మాటల్ని పూర్తిగా నమ్మింది. ఆయన ముఖంలోని బడలిక. కళ్ళలోని నీరసం ఆమె చూపుకు ఆనలేదు.

* * *

ఆరుబయట వేసుకున్న మంచంలో ఒకపక్కకు వత్తిగిలి ముడుచుకొని పడుకొని వున్నారు వెంకటరత్నం మాస్టారు. చల్లనిగాలి సుతారంగా వీస్తుంది. మెత్తని వెన్నెల విలాసంగా జారుతుంది.

వెంకటరత్నం మాస్టారు ప్రభాకరం ప్రవర్తనను సమర్థించటానికి. సమాధాన పడటానికి ప్రయత్నించి విఫలుడవుతున్నాడు.

పిల్లలకు చదువు చెప్పటం పంతులుగా తన ధర్మం. తన దగ్గర చదువుకున్న వాళ్ళందరూ తనకు కృతజ్ఞత చూపాలని. ఏదో సహాయం చేయాలని ఆశించటం అత్యాశే అవుతుంది. అవివేకం కూడా.

"మావాడికి ఉద్యోగమివ్వ"మని దేబిరించటం ...ఛా....ఛా.

ప్రభాకరాన్ని ... చి అడగక పోవటమే మంచి

మాస్టారు సమాధాన పడలేకపోతున్నారు. ఆయన మనసులోని ఒక భాగం మెడతెగిన కోడిలా గిల గిల లాడిపోతుందని ఆయనకు తెలియదు.

"కథలు వ్రాసే రచయితలనందరినీ నడిబజార్లో వరుసగా నిలబెట్టి పారకుల్లో అందుకోలేని ఆశల్ని రేపటందేనికీ" అని గట్టిగా అడిగేయాలనుకుంటుంది ఆ భాగం అనికూడా మాస్టారికి తెలియదు.

మాస్టారు వెన్నెల్లో తడిసిపోతున్నారు ఆయన మనసు బాధతో తడిసిపోతుంది. తడిచి ముద్దయి పొడయిపోతుంది.

మాస్టారు తీవ్రంగా ఆలోచిస్తున్నారు.

ఆయన ఆలోచిస్తుందీ___

పత్రికల్లో పడిన కథలగురించీ కాదు. ఆ కథలు తనలో రేపిన ఆశలగురించీ కాదు.

ఉద్యోగంలేని కొడుకు గురించీకాదు. వాడికి ఉద్యోగం ఎలా వస్తుందనీకాదు. తన శిష్యులగురించి అసలేకాదు.

ఆ నెల్లో అదనంగా ఖర్చయిన పది రూపాయలను గురించే మాస్టారు ఆలోచిస్తున్నారు అంత తీవ్రంగా. □